క్లుప్తంగా

ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరి



నెల్లూరు సిటీ: నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని దుకాణాలు, వ్యాపార కేంద్రాలకు ట్రేడ్ లైసెన్స్ తప్పక ఉండాలని కమిషనర్ హరిత పేర్కొన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలో శానిటరీ విభాగాధికారులతో బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. ట్రేడ్ లైసెన్స్ లేని దుకాణాలను గుర్తించి వెంటనే వాటి పరిధిలోకి తీసుకురావాలని సూచించారు. క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటి నుంచి చెత్తను ప్రణాళికబద్ధంగా సేకరించాలని కోరారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని పేర్కొన్నారు. మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

మహిళకు అరుదైన లేజర్ చికిత్స

నెల్లూరు(అర్బన్): రెండు కాళ్లకు నరాలు ఉబ్బి నొప్పులతో బాధపడుతున్న మహిళకు తమ ఆస్పత్రిలో అరుదైన లేజర్ చికిత్సను నిర్వహించి నయం చేశామని పొగతోటలోని సుధీర్ హాస్పిటల్, న్యూరో సెంటర్ డాక్టర్ నాగమాణిక్యం పేర్కొన్నారు. ఈ మేరకు వివరాలను బుధవారం ఆయన వెల్లడించారు. ధనలక్ష్మీపురానికి చెందిన 65 ఏళ్ల మహిళకు దాదాపు 15 సంవత్సరాలుగా రెండు కాళ్లకు నరాలు ఉబ్బిపచ్చగా కనిపించేవన్నారు. విపరీతమైన నొప్పులతో పని కూడా చేసుకోలేకపోయేవారని తెలిపారు. ఇలాంటి సమయంలో ఆస్పత్రికి వచ్చి తనను సంప్రదించారని, ఈ క్రమంలో లేజర్ చికిత్సపై వివరించి అల్ట్రా సౌండ్ గైడెడ్‌తో శస్త్ర చికిత్స చేశామని వివరించారు. ఎలాంటి కోత, కుట్లు లేకుండా అదే రోజున డిశ్చార్జి చేశామని పేర్కొన్నారు. సీనియర్ సర్జన్ రామ్మోహన్, వాణి, న్యూరోసర్జన్ ధీరజ్, తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు అందాలి



మాట్లాడుతున్న హరిత

నెల్లూరు సిటీ: ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చర్యలు చేపట్టాలని కమిషనర్ హరిత సూచించారు. 22వ డివిజన్ బీవీనగర్‌లోని మదర్‌థెరిసా వీధిలో గల వార్డు సచివాలయాన్ని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేసిన అనంతరం ఆమె మాట్లాడారు. ఆస్తి, కుళాయి, యూజర్ చార్జీలను వేగవంతంగా వసూలు చేయాలని సూచించారు. జగనన్న భూ హక్కు పథకంలో భాగంగా రీ సర్వేను వెంటనే ప్రారంభించాలని తెలిపారు.

పక్కాగా ఇంటర్ ప్రాక్టికల్స్



మాట్లాడుతున్న సాయిసుబ్బారావు

నెల్లూరు(అర్బన్): ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్‌ను పక్కాగా నిర్వహించాలని ఆర్జేడీ సాయి సుబ్బారావు పేర్కొన్నారు. నగరంలోని రావూస్ కళాశాలలో ప్రిన్సిపల్స్, అధ్యాపకులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రాక్టికల్స్ జరిగే ప్రాంతాల్లో విద్యార్థులకు వసతులను కల్పించాలని సూచించారు. కాపీయింగ్ జరగకుండా తనిఖీలు చేపట్టాలని కోరారు. ప్రాక్టికల్స్ సందర్భంగా పాటించాల్సిన జాగ్రత్తలను ఆర్ఐఓ వరప్రసాద్ వివరించారు. డీఈసీ అధికారులు శ్రీనివాసులురెడ్డి, వేణుగోపాల్, వెంకటేశ్వర్లు, హెచ్‌పీసీ సికందర్, తదితరులు పాల్గొన్నారు.

ఆహా సీజన్ - 2 మ్యూజికల్ నైట్ నేడు



మాట్లాడుతున్న రాజశేఖర్, వెంకటేశ్వర్లు

నెల్లూరు(బృందావనం): ఆహా సీజన్ – 2 లాంచింగ్ మ్యూజికల్ నైట్‌ను కొండాయపాళెం రోడ్డులోని వీపీఆర్ కన్వెన్షన్ హాల్లో గురువారం సాయంత్రం నిర్వహించనున్నామని ఆహా ఓటీటీ మార్కెటింగ్ హెడ్ రాజశేఖర్ తెలిపారు. కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను రామ్మూర్తినగర్‌లోని విర్టుస కార్యాలయంలో విర్టుస లైఫ్ స్పేస్ అధినేత వెంకటేశ్వర్లుతో కలిసి బుధవారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. తెలుగు ఇండియన్ ఐడల్ సీజన్ వన్ విజేత, నెల్లూరీయురాలైన వాగ్దేవి, ఆహా గాయకులు, న్యాయనిర్ణేతలు, మ్యూజిక్ డైరెక్టర్ తమన్, గాయకులు కార్తీక్, గీతామాధురి, హేమచంద్రతో కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని వివరించారు. ఎలాంటి ప్రవేశ రుసుము లేదని, పాసులున్న వారికి మాత్రమే అనుమతి ఉంటుందని చెప్పారు. ఆన్‌లైన్ ద్వారా ఎంట్రీ పాసుల నమోదు ప్రక్రియను చేపట్టామని పేర్కొన్నారు.

నైపుణ్య పెంపుతో రాణించొచ్చు

- కేఎల్ వర్సిటీ, సాక్షి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు
- అడ్మిషన్స్ డైరెక్టర్ శ్రీనివాసరావు



ప్రతిభ చూపిన విద్యార్థులకు జ్ఞాపికల ప్రదానం

నెల్లూరు రూరల్: విద్యార్థులు తగిన విధంగా నైపుణ్యాన్ని పెంపొందించుకుంటే రాణించడం సులభమవుతుందని కేఎల్ వర్సిటీ అడ్మిషన్స్ డైరెక్టర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. ధనలక్ష్మీపురంలోని శ్రీచైతన్య బాలుర జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థులతో గమ్యం – గమనం కార్యక్రమాన్ని కేఎల్ వర్సిటీ, సాక్షి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. ఇంటర్మీడియట్ దశ విద్యార్థులకు ఎంతో కీలకమని, బంగారు భవితకు బాటలు వేసుకోవాలని కోరారు. ఇంజినీరింగ్‌లో డిగ్రీలు సాధించడం గొప్పకాదని, అందులో నైపుణ్యాన్ని సాధించడం ఎంతో అవసరమని చెప్పారు. తగిన నైపుణ్యంతో దేశవిదేశాల్లో మంచి కంపెనీల్లో అవకాశాలు లభిస్తాయని వివరించారు. విద్యార్థులు ఎంచుకునే కోర్సుల ఆధారంగా అవకాశాలొస్తాయని.. లక్ష్యసాధన, సాంకేతిక పరిజ్ఞానం ఎంతో అవసరమని పేర్కొన్నారు. సాఫ్ట్‌వేర్ రంగంలో కొద్ది గంటలే పనిచేసి లక్షల్లో జీతాలను పొందవచ్చన్నారు. కేఎల్ వర్సిటీ ద్వారా విద్యార్థులకు మంచి ప్లేస్‌మెంట్లను చూపుతున్నామని వెల్లడించారు. ఈ విషయంలో తమ వర్సిటీ దేశంలోనే నాలుగో స్థానంలో ఉందని తెలిపారు. తమ వర్సిటీ ద్వారా ఏటా రూ.100 కోట్లకుపైగా స్కాలర్‌షిప్‌లను అందిస్తున్నామన్నారు.

వర్సిటీ ద్వారా పలు సేవలు

కేఎల్ వర్సిటీ ద్వారా విద్యార్థులకు చదువే కాకుండా పలు సేవలను అందిస్తున్నామని ప్రొఫెసర్ షణ్ముఖ్ పేర్కొన్నారు. వర్సిటీ నిర్వహించే ప్రవేశ పరీక్ష రాసిన విద్యార్థులకు ఫీజు రాయితీతో పాటు ఏడాది చదివిన అనంతరం బ్రాంచ్‌లను మార్చుకునే అవకాశాన్ని కల్పిస్తామని తెలిపారు. ఇంజినీరింగ్ వైపు యువతను మళ్లించడమే తమ లక్ష్యమని చెప్పారు.

పతకాలు, జ్ఞాపికల అందజేత

శ్రీచైతన్య కళాశాలల్లో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు జ్ఞాపికలు, పతకాలను అందజేశారు. ద్వితీయ సంవత్సరంలోనూ ఉత్తమ ఫలితాలను సాధించాలని కాంక్షించారు. వర్సిటీ రీజనల్ మేనేజర్ శివరామకృష్ణ, ధనలక్ష్మీపురం శ్రీచైతన్య కళాశాల ప్రిన్సిపల్ దిలీప్, తదితరులు పాల్గొన్నారు.



సదస్సుకు హాజరైన విద్యార్థులు

అవగాహన ఏర్పడింది



కేఎల్ వర్సిటీ వారు ఇంజినీరింగ్ కళాశాలల ప్రాధాన్యం, ప్లేస్‌మెంట్లపై నిర్వహించిన సదస్సుతో ఎంతో అవగాహన ఏర్పడింది. భవిష్యత్తులో ఉత్తమ కోర్సులను ఎంచుకొని రాణించాలని ఉంది. సందేహాలు సైతం నివృత్తయ్యాయి.

– శ్రీరామ్,
ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర విద్యార్థి

విషయ పరిజ్ఞానం పెరిగింది



సదస్సు ద్వారా విషయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకున్నా. భవిష్యత్తులో తీసుకునే కోర్సుల కోసం ఇప్పటి నుంచే ఏ విధంగా సిద్ధంగా ఉండాలో అర్థమైంది. సందేహాలను నివృత్తి చేసుకున్నా.

– అక్షయ, ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర విద్యార్థి

కొత్త కోర్సులను తెలుసుకున్నా



ఇంజినీరింగ్‌లో వచ్చిన కొత్త కోర్సులను తెలుసుకున్నాను. ఇలాంటి సదస్సులు విద్యార్థులకు ఎంతో అవసరం. భవిష్యత్తులో మంచి కోర్సును తీసుకొని రాణించాలని ఉంది.

– సుప్రజ,
ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర విద్యార్థి

ఇలాంటి సదస్సులతో ఎంతో ఉపయోగం



ఇలాంటి సదస్సులతో సందేహాలను నివృత్తి చేసుకునేందుకు అవకాశం ఏర్పడుతుంది. మంచి కోర్సు తీసుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఉంది.

– లక్ష్మీవర్షిత,
ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర విద్యార్థి

బలహీన వర్గాలకు అధిక ప్రాధాన్యం

- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు (సెంట్రల్): రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాలకు రాజకీయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యమిస్తున్నారని వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున ఎమ్మెల్సీ అభ్యర్థిగా మేరిగ మురళీధర్ నామినేషన్ కార్యక్రమం అనంతరం రాజ్యసభ సభ్యుడు, పార్టీ జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎంపీ, పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి, తిరుపతి ఎంపీ గురుమూర్తి, ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మతో కలిసి కలెక్టరేట్ సమీపంలో మీడియా సమావేశంలో బుధవారం మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. సీఎం ఆశీస్సులతో ఉమ్మడి నెల్లూరు జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా మేరిగ మురళీధర్‌ను ఎంపిక చేశారని వివరించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు పెద్దపీట వేస్తున్నారనే దానికి ఇదే నిదర్శనమన్నారు. స్థానిక ఎమ్మెల్సీతో పాటు పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీల అభ్యర్థులూ నెల్లూరు జిల్లాకు చెందిన వారేనని, వీరిని గెలిపించుకుందామని పిలుపునిచ్చారు.

రాజ్యాధికారంలో భాగస్వామ్యం

ఇంత వరకు ఏ రాజకీయ పార్టీ చేయని విధంగా బడుగు, బలహీన వర్గాలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయంగా పెద్ద పీట వేస్తున్నారని ఎమ్మెల్సీ అభ్యర్థి మేరిగ మురళీధర్ పేర్కొన్నారు. తనకు అవకాశం ఇచ్చారని, ఎంతో నమ్మకంతో పని చేస్తానని చెప్పారు. సీఎంకు జీవితకాలం రుణపడి ఉంటాసన్నారు. తిరుపతి ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ.. రాష్ట్రంలో 18కి గానూ 14 ఎమ్మెల్సీ స్థానాలను ఎస్సీ, ఎస్టీ, బీసీలకు సీఎం కేటాయించారని, ఆయన్ను అభినవ అంబేడ్కర్‌గా భావిస్తున్నామన్నారు. ప్రస్తుతం జరుగుతున్న మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలుపించుకుందామని పిలుపునిచ్చారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ మాట్లాడుతూ.. అన్ని వర్గాలను దృష్టిలో పెటుకొని సమన్యాయం చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరం రుణపడి ఉంటామన్నారు. బలహీన వర్గాలకు రాజకీయంగా పెద్దపీట వేస్తున్న ఆయనకు అండగా ఉండాలని పేర్కొన్నారు.

నెల్లూరుకు త్వరలో రింగ్ రోడ్డు

- ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: నగరానికి త్వరలో రింగ్ రోడ్డు మంజూరు కానుందని ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. కలివెలపాళెంలో పార్టీ నేతలు, కార్యకర్తలతో బుధవారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ఆయా ప్రాంతాలు అభివృద్ధి చెందడంతో భూములకు ఎనలేని విధంగా ధరలు వచ్చాయని, దీంతో రైతులందరూ ఆర్థికంగా బాగున్నారని చెప్పారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణాన్ని తాను కోరుకుంటానని.. గొడవలు, కేసుల్లేకుండా ఉండేలా అందరికీ సర్ది చెప్పడం తన నైజమన్నారు. గ్రామాల్లో కక్షలుంటే అభివృద్ధికి ఆటంకం కలుగుతుందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి వ్యాపారులను బెదిరించి దురాగతాలకు పాల్పడ్డారని ఆరోపించారు. రూరల్‌లో జరిగే అభివృద్ధి కార్యక్రమాలకు ఎంపీనైన తనను పిలిచేవారు కాదని చెప్పారు. నేతలు, కార్యకర్తలు సమన్వయంతో వ్యవహరించి పార్టీ బలోపేతానికి పాటుపడాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

కోటంరెడ్డి నియంత పాలనకు చరమగీతం

ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి నియంత పాలనకు చరమగీతం పలికే పరిస్థితులొచ్చాయని.. పార్టీ నేతలు, కార్యకర్తలు ఎంతో స్వేచ్ఛగా ఉన్నారని డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. తన సతీమణి అరుణమ్మ జెడ్పీ చైర్‌పర్సన్ హోదాలో గతంలో గ్రామాల్లో పర్యటించే సమయంలో ఆయా ప్రాంతాల నేతలు తమ వెంట వచ్చేందుకు సంశయించేవారని తెలిపారు. కోటంరెడ్డి దుర్మార్గపు ఆలోచనలే అతని పతనానికి దారితీస్తాయని పేర్కొన్నారు. వర్గపోరు సాగించి పార్టీ నేతలు, కార్యకర్తలను ఇబ్బంది పెట్టారని ధ్వజమెత్తారు. విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, మాజీ కార్పొరేటర్ వెంకయ్య, ముత్రిపాడు జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గణాంక కోర్సులతో ఉపాధి అవకాశాలు



విజేతలకు బహుమతుల ప్రదానం

నెల్లూరు(అర్బన్): గణాంక కోర్సులు చదివే వారికి ప్రైవేట్, ప్రభుత్వ విభాగాల్లో పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని నేషనల్ శాంపిల్ సర్వే ఉప ప్రాంతీయ కార్యాలయాధికారి శ్రీనివాసరావు పేర్కొన్నారు. నగరంలోని డీకేడబ్ల్యూ కళాశాల విద్యార్థులకు ఎన్నెస్సెస్‌ఓ ఆధ్వర్యంలో పలు పోటీలను బుధవారం నిర్వహించారు. విజేతలకు బహుమతులు, షీల్డులను అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. ఎనిమిది డిగ్రీ కళాశాలల నుంచి విద్యార్థులు పోటీల్లో తలపడగా, డీకేడబ్ల్యూ విద్యార్థినులు ప్రథమ బహుమతులను సాధించడాన్ని అభినందించారు. ప్రిన్సిపల్ గిరి, ఎన్నెస్సెస్‌ఓ అధికారి రామకృష్ణ, స్టాటిస్టిక్స్ డిపార్ట్‌మెంట్ విభాగాధిపతి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య



నెల్లూరు(క్రైమ్): రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చంద్రమౌళీనగర్ సమీపంలోని పట్టాలపై బుధవారం పట్టపగలు చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల సమాచారం మేరకు.. కనుపర్తిపాడులో శ్రీనివాసులు (48) తన భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి నివాసం ఉంటున్నారు. భవన నిర్మాణాల వద్ద వాచ్‌మెన్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన నెల్లూరు వైపు వెళ్లే పట్టాలపై తిరుపతి – పూరి ఎక్స్‌ప్రెస్ కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డారు. సమాచారం అందుకున్న నెల్లూరు రైల్వే ఎస్సై హరిచందన ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. ఈ క్రమంలో శ్రీనివాసులు బంధువులు అతని కోసం గాలింపు చర్యలు చేపట్టి రైల్వే పోలీసులను సంప్రదించారు. ఫోన్లోని ఫొటో ఆధారంగా మృతుడు శ్రీనివాసులేనని నిర్ధారించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబానికి బెదిరింపులు

నెల్లూరు(క్రైమ్): కుటుంబాన్ని అసభ్యకర పదజాలంతో దూషించడమే కాకుండా బెదిరింపులకు పాల్పడుతున్న వ్యక్తిపై సంతపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. సంతపేటలోని సుదర్శన్‌వీధికి చెందిన రాజాకు శ్రీహరినగర్‌లో నాలుగెకరాల స్థలం పూర్వీకుల నుంచి సంక్రమించింది. సదరు స్థలాన్ని కొనుగోలు చేస్తామంటూ అడ్వాన్స్ కింద రూ.30 లక్షలను అనంతపురం జిల్లాకు చెందిన రమేష్, కృష్ణారెడ్డి 2021లో ఇచ్చారు. ఎనిమిది నెలల్లో రిజిస్ట్రేషన్ చేసుకుంటామని.. ఆ సమయంలో మిగిలిన నగదును చెల్లిస్తామని.. లేని పక్షంలో అడ్వాన్స్ తిరిగిచ్చేది లేదని అగ్రిమెంట్ చేసుకున్నారు. గడువు ముగిసిన అనంతరం రాజా వారికి లీగల్ నోటీస్‌ను పంపారు. అప్పటి నుంచి నగదును తిరిగివ్వాలంటూ రమేష్ అసభ్యకరంగా మాట్లాడుతూ బెదిరింపు కాల్స్ చేస్తున్నారు. నెల క్రితం నెల్లూరొచ్చి రాజా తండ్రి వద్ద ఖాళీ ప్రామిసరీ నోట్లపై సంతకాలు చేయించుకెళ్లారు. అనంతరం సైతం రమేష్ ఫోన్ ద్వారా రాజా, అతని కుటుంబసభ్యులను అసభ్యకర పదజాలంతో దూషిస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వ్యక్తిపై దాడి

నెల్లూరు(క్రైమ్): బైక్‌ను ర్యాష్‌గా ఎందుకు నడుపుతున్నావని ప్రశ్నించిన వ్యక్తిపై వాహనచోదకుడు దాడి చేశారు. వివరాలు.. ఇందుకూరుపేట మండలం జగదేవిపేటకు చెందిన ఆటోడ్రైవర్ శివయ్య ఆత్మకూరు బస్టాండ్ వద్ద బుధవారం ఉండగా, నగరానికి చెందిన శ్రీనివాసులు తన బైక్‌ను ర్యాష్‌గా నడుపుతూ ఢీకొనబోయారు. ఎందుకు ర్యాష్‌గా నడుపుతున్నావని ప్రశ్నించిన శివయ్యపై దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నవాబుపేట పోలీసులు కేసు నమోదు చేశారు.

బైక్ దహనం

నెల్లూరు(క్రైమ్): ఇంటి ముందు నిలిపి ఉంచిన బైక్‌కు గుర్తుతెలియని దుండగులు నిప్పంటించిన ఘటన మహాత్మాగాంధీనగర్‌లో చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. మహాత్మాగాంధీనగర్‌కు చెందిన ఫైరోజ్ ఆర్టీఏ కార్యాలయ సమీపంలో నెట్ సెంటర్‌ను నిర్వహిస్తున్నారు. తన రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌ను ఇంటి ముందు మంగళవారం నిలిపారు. ఈ క్రమంలో బైక్‌కు గుర్తుతెలియని దుండగులు బుధవారం తెల్లవారుజామున నిప్పంటించారు. మంటల్లో బైక్ కాలిపోతుండటాన్ని గమనించిన స్థానికులు బాధితుడ్ని నిద్రలేపి విషయాన్ని తెలియజేశారు. ఆయన బయటకొచ్చి చూడగా అప్పటికే బైక్ పూర్తిగా దగ్ధమైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు వేదాయపాళెం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

జీజీహెచ్‌లో ఆకస్మిక తనిఖీలు



నెల్లూరు(అర్బన్): సమయపాలన పాటించకుండా వైద్యులు త్వరగా వెళ్లిపోతున్నారనే విమర్శల నేపథ్యంలో దర్గామిట్టలోని జీజీహెచ్‌లో ఆకస్మిక తనిఖీలను సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధానాయక్ బుధవారం చేపట్టారు. ట్రామా కేర్ యూనిట్‌లోని రోగులతో మాట్లాడి వైద్యసేవలను ఆరా తీశారు. డాక్టర్లు అందుబాటులో లేకపోతే చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. అనంతరం డాక్టర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రమాదాల్లో గాయపడిన క్షతగాత్రులకు మంచి వైద్యాన్ని అందించాలని సూచించారు. పురిటి పిల్లలకు అవసరమైన అన్ని వైద్య పరికరాలను సమకూర్చుకోవాలని, దీనికి పూర్తి సహకారాన్ని అందిస్తామన్నారు. డాక్టర్లు మస్తాన్‌బాషా, మధుసూదన్, అరుణ్‌కాంత్, సుబ్రహ్మణ్యం, శానిటరీ సూపర్‌వైజర్ మస్తానయ్య, తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా అలకలతోపు ఉత్సవం



నెల్లూరు(బృందావనం): మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో అలకలతోపు ఉత్సవాన్ని వేడుకగా బుధవారం నిర్వహించారు. భువనేశ్వరి అమ్మవారు వ్యాఘ్ర వాహనంపై, మూలస్థానేశ్వరస్వామి వెండినంది వాహనంపై కొలువై భక్తులను అనుగ్రహించారు. చప్పరోత్సవానికి ఉభయకర్తలుగా రఘునాథరాజు, జానకి దంపతులు వ్యవహరించారు. కాగా గురువారం ఉదయం తొమ్మిదికి తీర్థవాది, రాత్రి ఏడు గంటలకు ధ్వజావరోహణ, తిరిచ్చి ఉత్సవాన్ని నిర్వహించనున్నారు.

సతారా పర్వత శ్రేణులు ఎంతో విశిష్టమైనవి



ప్రవచిస్తున్న చాగంటి కోటేశ్వరరావు

నెల్లూరు(బృందావనం): భక్తులు ఆర్తితో భగవంతుడ్ని పిలిస్తే ఏదో ఒక రూపంలో తన ఉనికిని చాటుకొని వారికి తన అనుగ్రహాన్ని అందించి సంరక్షిస్తారని ప్రవచన చక్రవర్తి చాగంటి కోటేశ్వరరావు పేర్కొన్నారు. భరద్వాజ రుద్రాభిషేక సంఘ ఆధ్వర్యంలో సతారా (ఉత్తర చిదంబర క్షేత్రం) వైభవంపై పురమందిర ప్రాంగణంలో బుధవారం ఆయన ప్రవచించారు. సృష్టిలో సతారా పర్వత శ్రేణులు ఎంతో విశిష్టమైనవని చెప్పారు. సకలజనులు వేదాలను ప్రామాణికంగా తీసుకొని జీవించాలన్నారు. సతారా పర్వత శ్రేణుల్లో ఉద్భవించే కృష్ణానదీ జలాల పవిత్రత ఎంతో గొప్పదని, కృష్ణవేణి నదీమతల్లి సాక్షాత్తు విష్ణుస్వరూపంగా సర్వపాపాఘ్ని అని ఆయన అభివర్ణించారు.

25 మందికి సీమంతాలు

నెల్లూరు(వేదాయపాళెం): బోడిగాడితోట సమీపంలో నివసిస్తున్న 25 మంది గర్భిణులకు సీమంతాలను ప్యూర్ స్మైల్స్ సేవా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. చీరలు, గాజులను అందజేసి అన్నదానాన్ని నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీఓ అనూరాధ, సూపర్‌వైజర్ సునీలత, సంస్థ అధ్యక్షురాలు పర్వీన్, ప్రమీల, లక్ష్మీరాజ్యం, సభ్యులు నళిని, లక్ష్మి, తాహెర, తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): కిసాన్‌నగర్‌లోని రాజీవ్‌గాంధీకాలనీలో నిర్వహిస్తున్న పేకాట కేంద్రంపై ఎస్ఈబీ అధికారులు మంగళవారం రాత్రి దాడి చేసి 15 మంది జూదరులను అదుపులోకి తీసుకొని తదుపరి విచారణ నిమిత్తం నవాబుపేట పోలీసులకు అప్పగించారు. నవాబుపేట ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు వివరాలను బుధవారం వెల్లడించారు. హరనాథపురానికి చెందిన జాఫర్‌ఖాన్ కిసాన్‌నగర్ రాజీవ్‌గాంధీకాలనీలో ఓ ఇంటిని అద్దెకు తీసుకొని కొంతకాలంగా గుట్టుచప్పుడు కాకుండా పేకాట కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. దీనిపై జిల్లా ఎస్ఈబీ అధికారి శ్రీలక్ష్మికి సమాచారం అందింది. ఆమె ఆదేశాల మేరకు డీఎస్ఈఓ, నెల్లూరు – 1 ఇన్‌స్పెక్టర్లు హుస్సేన్, కిశోర్ తమ సిబ్బందితో కలిసి దాడి చేశారు. నిర్వాహకుడు జాఫర్‌ఖాన్‌తో పాటు జూదరులైన ఎఫ్‌సీఐ కాలనీలోని శ్రీనివాసులురెడ్డి, వెంకటేశ్వరపురం ఇస్లాంపేటలోని హుస్సేన్, జాకీర్‌హుస్సేన్‌నగర్ నేతానగర్‌లోని బాబూరావు, రమేష్‌బాబు, నవాబుపేటలోని గాండ్లవీధికి చెందిన శ్రీనివాసులు, ముత్రిపాడు మండలంలోని హజరత్, కోవూరు మండలం పోతిరెడ్డిపాళెంలోని మహేష్, పాటూరులోని బాబు, పడుగుపాడులోని హరిబాబు, కొడవలూరు మండలం తలమంచిలోని వెంకటసుధీర్, మాగుంట లేఅవుట్ లెక్చరర్స్ కాలనీలోని శ్రీనివాసులు, సత్యనారాయణపురంలోని దుర్గారావు, సరస్వతీనగర్‌లోని దశరథరామిరెడ్డి, ఇందుకూరుపేట మండలం మైపాడులోని హరిని అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి రూ.78,850 నగదు, 11 సెల్‌ఫోన్లు, ఏడు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. నిర్వాహకుడిపై గతంలోనూ కేసులున్నాయని గుర్తించారు.

యువకుడి అదృశ్యం

నెల్లూరు(క్రైమ్): యువకుడి అదృశ్యంపై వేదాయపాళెం పోలీసులకు తండ్రి ఫిర్యాదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. జ్యోతినగర్‌లో నివాసం ఉంటున్న అనిల్‌కు భార్య, ఇద్దరు పిల్లలు. కుమారుడు అవినాష్‌రెడ్డి ఎలక్ట్రీషియన్ పనులు చేస్తూ కుటుంబానికి చేదోడువాదోడుగా ఉంటున్నారు. ఈ నెల 11న ఆయన అదృశ్యమయ్యారు. గాలింపు చర్యలు చేపట్టినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన కుమారుడు అప్పుడప్పుడూ మతిస్థిమితం కోల్పోతారని ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసుల అదుపులో నిందితుడు..?

నెల్లూరు(క్రైమ్): ప్రేమ పేరిట బాలికను మోసగించిన ఘటనలో నిందితుడ్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారని సమాచారం. వివరాలు.. పొదలకూరుకు చెందిన ఓమహిళ నగరంలోని సారాయి అంగడి సెంటర్‌లో చేప లను విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ నెల 12న తన కుమార్తెతో కలిసి చేపలను విక్రయించసాగారు. ఈ క్రమంలో బాలిక అదృశ్యమవ్వడంతో దర్గామిట్ట పోలీసు లకు తల్లి ఫిర్యాదు చేశారు. తిరుమల అనే యువకుడితో సన్నిహితంగా ఉండేదని, అతనిపై అనుమానం ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు.. తిరుమలే మాయ మాటలతో బాలికను తన వెంట తీసుకెళ్లారనే అంశాన్ని గుర్తించారు. ఈ క్రమంలో బాలికను నగరంలో మంగళవారం వదిలి ఆయన పరారయ్యారు. బాలికను వెంటబెట్టుకొని దర్గామిట్ట పోలీస్‌స్టేషన్‌కు తల్లి చేరుకున్నారు. తనను విజయవాడకు తిరుమల తీసుకెళ్లి వివాహం చేసుకొని మోసం చేశారని పోలీసులకు బాలిక తెలిపింది. దీంతో మిస్సింగ్ కేసును కిడ్నాప్, పోక్సో చట్టం కింద పోలీసులు మార్పు చేశారు. వైద్య పరీక్షల నిమిత్తం జీజీహెచ్‌కు బాలికను తరలించారు. దర్గామిట్ట పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్న నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి విచారణను బుధవారం చేపట్టారు. బాధిత కుటుంబసభ్యులు, బాలికను విచారించారు. కాగా నిందితుడ్ని పోలీసుల అదుపులోకి తీసుకున్నారని సమాచారం. నేడో, రేపో నిందితుడి అరెస్టును చూపించే అవకాశం ఉంది.